అపురూపం.. నిజరూపం



అలంకరణలో అమ్మవారు

కోటదుర్గమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు

పాలకొండ, గ్రామీణం, న్యూస్‌టుడే: పాలకొండ కోటదుర్గమ్మ దసరా ఉత్సవాలు గురువారం అంగ రంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ తల్లి రవణమ్మతో కలిసి తొలిపూజ చేసి ప్రారంభించారు. అనంతరం పట్టువస్త్రాలు సమర్పించారు. అమ్మవారికి ఆలయ ప్రధాన అర్చకుడు దార్లపూడి లక్ష్మీప్రసాద్‌శర్మ విశేష పూజలు చేశారు.

అమ్మవారి నిజరూప దర్శనానికి పలు ప్రాంతాల నుంచి సుమారు 30 వేల మంది వరకు భక్తులు రావడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయం కిక్కిరిసింది. ప్రముఖులను మాత్రమే అంతరాలయంలోకి అనుమతించడంతో సామాన్య భక్తులు ప్రశాంతంగా దర్శనం చేసుకున్నారు. అసిస్టెంట్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ ప్రియాంక నిషాని దంపతులు, ఎమ్మెల్సీ పి.విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే వి.కళావతి, సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి, తెదేపా రాష్ట్ర కార్యదర్శి కె.అప్పలనాయుడు, పట్టణాధ్యక్షుడు జి.సంతోష్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.



ప్రారంభ పూజలు చేస్తున్న ఎమ్మెల్యే, కమిటీ సభ్యులు



వరుసలో నిల్చొన్న భక్తులు

ట్రాఫిక్ మళ్లింపు

ఉత్సవాల నేపథ్యంలో డీఎస్పీ ఎం.రాంబాబు, సీఐ ఎం.చంద్రమౌళి ఆధ్వర్యంలో 200 మంది సిబ్బంది బందోబస్తులో పాల్గొన్నారు. రాజాం, వీరఘట్టం వైపు నుంచి పట్టణంలోకి వచ్చే వాహనాలను అన్నవరం మీదుగా మళ్లించారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన సుమారు 7 వేల మందికి ఆలయ ఆవరణలో అన్నదానం చేశారు. కళింగవైశ్య యువజన సంఘం సభ్యులు 150 లీటర్ల మజ్జిగ పంపిణీ చేశారు. ఉత్సవ కమిటీ పర్యవేక్షకుడు పి.కొండలరావు ఆధ్వర్యంలో సభ్యులు ఏర్పాట్లు చేశారు.

నేడు జిల్లాకు కేంద్ర కమిటీ

పార్వతీపురం, న్యూస్‌టుడే: జిల్లాలోని పది పంచాయతీల్లో కేంద్రం అమలు చేస్తున్న ఉపాధి పథకం, పింఛన్ల పంపిణీ, జీవనోపాధులు, గృహ నిర్మాణం, రహదారులు, నైపుణ్యాభివృద్ధి తదితర పథకాల తీరు పరిశీలనకు కేంద్ర బృందం శుక్రవారం నుంచి ఈ నెల 12 వరకు జిల్లాలో పర్యటించనుంది. కేరళలో గ్రామీణాభివృద్ధి సంస్థకు చెందిన పరిశోధకులు సస్యప్పన్, కె.జి.సలీమ్‌కుమార్ గ్రామాల్లో పర్యటిస్తారు.

విశాఖ-సాలూరు రైలు చుక్‌చుక్

సాలూరు ప్రాంతవాసుల కల నిజం కాబోతోంది. సాలూరు నుంచి విశాఖకు రైలు నడపాలంటూ ఏళ్లుగా పట్టణ, పరిసర ప్రాంతీయులు కోరుతున్నారు. ఎట్టకేలకు ఈ సర్వీసు ప్రారంభించనున్నారు. దీని కోసం శుక్రవారం ట్రయల్ రన్ నిర్వహించనున్నారు. విశాఖ నుంచి సాలూరు స్టేషన్‌కు వచ్చిన రైలు తిరిగి మధ్యాహ్నం 1.10 గంటలకు బయల్దేరనుంది. దీనికి జెండా ఊపి ప్రారంభించనున్నట్లు మంత్రి సంధ్యారాణి తెలిపారు.

–న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం



703 గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రణాళిక

పార్వతీపురం, న్యూస్‌టుడే: జిల్లాలోని 703 గిరిజన గ్రామాల సమగ్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ ప్రణాళిక అమలు చేస్తున్నట్లు జిల్లా పాలనాధికారి శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాత్సవతో కలిసి మాట్లాడారు. 25 అంశాలను ప్రాతిపదికగా తీసుకొని అన్ని గ్రామాల్లో పనులు చేస్తామని చెప్పారు. కుటుంబ ఆదాయం రెట్టింపు అయ్యేలా వనరుల కల్పన, నైపుణ్య పథకాలు అమలు చేయనున్నట్లు చెప్పారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, పీవో అశుతోష్ శ్రీవాత్సవ్

పీఎం జుగా..

జిల్లాలో 500 కంటే ఎక్కువ జనాభా ఉన్న 165 గ్రామాల్లో పీఎం జుగా పథకం అమలు చేస్తామని కలెక్టర్ చెప్పారు. '50 కంటే ఎక్కువ మంది ఉన్న 703 గ్రామాల్లో గృహ వసతి కల్పనకు ప్రణాళిక రూపొందించారు. అన్ని గ్రామాలకు రహదారులు, 1,435 గ్రామాల్లో రూ.256.76 కోట్లతో ఇంటింటికీ కుళాయిలు, వంద శాతం విద్యుత్తు సౌకర్యం, అన్ని ప్రభుత్వ సంస్థలకు సౌర విద్యుత్తు అమర్చనున్నారు. 5 కిలోమీటర్లలోపు ఆసుపత్రులు లేని గ్రామాలకు సంచార వైద్యసేవలు అందిస్తారు. సాక్షం పథకంలో 516 అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలకు రూ.12 లక్షల చొప్పున కేటాయించి ప్రతిపాదనలు పంపించినట్లు' కలెక్టర్ పేర్కొన్నారు. పీఎం జుగా కార్యక్రమానికి సంబంధించిన ప్రాధాన్యాలు, ప్రతిపాదనలు తయారు చేయాలని సంబంధిత శాఖల అధికారులకు సూచనలు చేశారు.

మహిళల రక్షణ ప్రభుత్వ బాధ్యత

రేపు సాలూరులో అవగాహన సదస్సు

'న్యూస్‌టుడే'తో మంత్రి సంధ్యారాణి



పార్వతీపురం, సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మహిళలు, బాలికలపై జరుగుతున్న అకృత్యాలు, దుశ్చర్యల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. అక్రమ రవాణా, అత్యాచారాలు, మోసాలు, బాల్య వివాహాలతో నష్టాలపై అవగాహన కల్పించడం, అప్రమత్తం చేసేందుకు రాష్ట్రంలోనే తొలిసారిగా సాలూరులో 'మహిళా రక్షణ సదస్సు' నిర్వహిస్తున్నట్లు మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి జి.సంధ్యారాణి పేర్కొన్నారు. ఈ కార్యక్రమం శనివారం నిర్వహించేందుకు జేసీ శోభిక ఏర్పాట్లు చేస్తున్నారు. సంబంధిత వివరాలను మంత్రి 'న్యూస్‌టుడే'కు వివరించారు.

అప్రమత్తం చేసేందుకే..

మహిళల రక్షణకు ఎన్ని చట్టాలు తీసుకొస్తున్నా అకృత్యాలు జరుగుతూనే ఉన్నాయి. స్త్రీలు తమకు తాముగా చైతన్యం కావాల్సిన అవసరం ఉంది. ఈ ఆలోచనతో జిల్లా స్థాయిలో 'మహిళా రక్షణ సదస్సు' నిర్వహించాలని నిర్ణయించాం. జిల్లాలో బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతున్నాయి. వీటితో కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తాం.

అధికారిణుల భాగస్వామ్యం

ఈ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని శాఖల్లో ఉన్న మహిళా అధికారిణులను భాగస్వాములను చేస్తాం. జేసీ శోభికతో పాటు ఏఎస్పీ అంకిత, డీఎఫ్‌వో ప్రసూన, డీఎంహెచ్‌వో విజయపార్వతి, శిశు సంక్షేమాధికారిణి ఎంఎన్.రాణి, సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, సాలూరు నియోజకవర్గ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలను సదస్సుకు ఆహ్వానిస్తున్నాం. ఇక్కడ తెలుసుకున్న అంశాలను వారి పరిధిలో మహిళలకు వివరించేలా చూస్తాం. జిల్లాలో వచ్చే స్పందనను అనుసరించి త్వరలో రాష్ట్రవ్యాప్తంగా సదస్సులు నిర్వహిస్తాం.

గంజాయిపై ఉక్కుపాదం

ప్రభుత్వ ఆదేశాలతో పోలీస్ శాఖ సాలూరు ప్రాంతంలో పటిష్ఠ నిఘా పెట్టి వంద రోజుల్లో ఒడిశా నుంచి వస్తున్న 155 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుంది. ఇందుకు కృషి చేసిన సాలూరు పోలీసులను ప్రత్యేకంగా అభినందిస్తున్నా. ఇకపై మరింత నిఘా పెంచి గంజాయి రవాణా, విక్రయాలు లేకుండా చర్యలు తీసుకుంటాం. గంజాయి నియంత్రణపై గురువారం రాష్ట్ర సబ్ కమిటీ సమావేశం జరిగింది. ఇందులో తీసుకున్న నిర్ణయాల మేరకు జిల్లాలోని ప్రతి పాఠశాలలో ఉదయం ప్రార్థన సమయంలో గంజాయి నియంత్రణపై విద్యార్థులు, ఉపాధ్యాయులను పోలీసులు చైతన్యపరుస్తారు. తరగతిలో విద్యార్థి కదలికలను పోలీసులకు ఉపాధ్యాయులు తెలియజేస్తారు.



అమ్మలగన్నమ్మా.. ఆదుకోవమ్మా



ఒమ్మిలో పసుపు కొమ్ములతో అమ్మవారు



విజయ నగరంలోని వైఎస్సార్ నగర్‌లో అలంకరణ


ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దసరా నవరాత్రి ఉత్సవాలు గురువారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. పలు గ్రామాల్లో అమ్మవారు మండపాల్లో కొలువుదీరారు. ఈ సందర్భంగా తల్లికి ప్రత్యేక పూజలు జరిగాయి. వివిధ దేవాలయాల్లో భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

– న్యూస్‌టుడే, విజయనగరం రింగురోడ్డు, నెల్లిమర్ల, జియ్యమ్మవలస





ఎస్.కోటలోని దుర్గాదేవికి పట్టణానికి చెందిన ఎ.రమేష్, స్వాతి దంపతులు గురువారం రూ.2.70 లక్షల విలువైన వెండి కిరీటం బహూకరించారు. ఊరేగింపుగా తీసుకొచ్చి, ఆలయ కమిటీకి ఇచ్చారు. అనంతరం తల్లికి అలంకరించారు. – న్యూస్‌టుడే, ఎస్.కోట



జియ్యమ్మవలస మండలం చినమేరంగిలో ఆకట్టుకుంటున్న మండపం

గత ప్రభుత్వ నిర్వాకం.. సచివాలయానికి తాళం



తాళం వేయడంతో మూతపడిన కొండపాలెం- 3 సచివాలయం



అసంపూర్తిగా భవనం

గరివిడి, న్యూస్‌టుడే: నెలల తరబడి అద్దె బకాయిలు చెల్లించకపోవడంతో గ్రామ సచివాలయానికి భవన యజమాని తాళం వేసిన సంఘటన గురువారం గరివిడి మండలం కొండపాలెం (గరివిడి) పంచాయతీలో చోటుచేసుకుంది. ఈ పంచాయతీలో 3వ సచివాలయానికి సొంత భవనం లేదు. ఫేకర్ పరిశ్రమ కార్మికుల కాలనీలో ఒక ఇంటిని నెలకు రూ.8 వేలకు అద్దెకు తీసుకుని నిర్వహిస్తున్నారు. గత 11 నెలలుగా అద్దె చెల్లించకపోవడంతో ఇంటి యజమాని భవనం తలుపులకు, గేటుకు తాళాలు వేశారు. విధులకు వచ్చిన సిబ్బంది గేటు బయటే నిల్చోవాల్సి వచ్చింది. ఈ విషయాన్ని వారు కొండపాలెం (గరివిడి) పంచాయతీ కార్యనిర్వహణాధికారి శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన యజమానితో మాట్లాడారు. త్వరలో బకాయిలు చెల్లిస్తామని తాళం తీయాలని కోరినా ఆయన ససేమిరా అనడంతో సిబ్బందిని పంచాయతీ కార్యాలయానికి రప్పించి.. అక్కడే విధులు నిర్వహించుకునే ఏర్పాట్లు చేశారు. పంచాయతీ సాధారణ నిధుల నుంచి సచివాలయానికి అద్దె చెల్లించాల్సి ఉందని, నిధుల కొరత కారణంగా కట్టలేకపోయామని శ్రీనివాస్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

పనులు పూర్తిచేయకే..

కొండపాలెం-3 సచివాలయానికి ఈ పరిస్థితి రావడానికి గత వైకాపా ప్రభుత్వ నిర్వాకమే కారణం. రూ.40 లక్షలతో ఈ సచివాలయ భవన నిర్మాణానికి 2020 జనవరిలో పనులు ప్రారంభించినా పూర్తి చేయలేదు. భవనం పైకప్పు వేసి వదిలేశారు. ప్లాస్టింగులు, గచ్చులు, తలుపులు, కిటికీల తదితర ప్రక్రియలు పూర్తికాలేదు. నిర్మాణం పూర్తయి ఉంటే అద్దె భవనంతో ఈ అవస్థలు ఉండేవి కావని గ్రామస్థులతో పాటు సిబ్బంది వాపోతున్నారు. పెండింగు పనుల పూర్తికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆదరిద్దాం.. ఆప్యాయత పంచుదాం

జీవవైవిధ్యం.. మనిషి మనుగడకు అత్యంత కీలకం. ఆధునిక యుగంలో మనకు తెలిసిన ఎన్నో జంతుజాతులు కనుమరుగైపోతున్నాయి. జంతు సంపదను పరిరక్షించడం, వృద్ధి చేయడం, వాటి హక్కులను కాపాడడమే లక్ష్యంగా ఏటా అక్టోబరు 4న ప్రపంచ జంతు దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో పరిస్థితిపై కథనం.

– న్యూస్‌టుడే, గరివిడి



పెంపుడు కుక్కకు టీకా వేస్తున్న పశు సంవర్థక శాఖ జేడీ

నేడు అంతర్జాతీయ జంతు దినోత్సవం

జిల్లాలో పశుగణాల సంఖ్య

ఆవులు	3,77,960
గేదెలు	97,845
గొర్రెలు	4,48,154
మేకలు	1,56,511
పందులు	5,404
కోళ్లు	39,32,896

పాడి పరిశ్రమకు మళ్లీ జీవం

జిల్లాలో ప్రధాన ఆదాయ వనరు పాడి పరిశ్రమ. వ్యవసాయ రంగంలో కరవు కాటకాలు వాటిల్లినపుడు రైతులను ఆదుకొనే ఈ పరిశ్రమను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. బీమా పథకాన్ని పాడెక్కించింది. పరిహారం బకాయిలు రూ.11.14 కోట్లు లబ్ధిదారులకు చెల్లించకుండా నిలిపివేసింది. మినీ గోకులాలకు మంగళం పాడేసింది. పశు వైద్యసేవలను నిర్లక్ష్యం చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మళ్లీ ఊపిరి పోసేలా పలు నిర్ణయాలు తీసుకుంది. ఉమ్మడి జిల్లాలో రాయితీపై 1,075 మినీ గోకులాల యూనిట్లు మంజూరు చేసింది. పశు బీమా పథకాన్ని పునరుద్ధరిస్తున్నట్లు ప్రకటించింది.

జంతు సంరక్షణ కార్యక్రమాలు

★ ఏటా జనవరిలో జంతు సంరక్షణపై పశు సంవర్ధక శాఖ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ పశు గణాలకు వైద్యసేవలు అందిస్తోంది. ★ పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి రాకుండా ఉచితంగా టీకాలు వేసే కార్యక్రమం జులై 6న అన్ని పశువైద్య కేంద్రాల్లో నిర్వహిస్తోంది. జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధుల నివారణ చర్యలపై అవగాహన కల్పిస్తోంది. ★ వీధి కుక్కల సంఖ్యను నివారించేందుకు స్నేహ యానిమల్ వెల్ఫేర్ సంస్థ ద్వారా పురపాలక సంఘాల పరిధిలో కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేపడుతోంది. రేబిస్ టీకాలు వేస్తోంది. ★ జులై మొదటి వారంలో పశుగ్రాస వారోత్సవాలు నిర్వహిస్తూ 75 శాతం రాయితీపై పశుగ్రాస విత్తనాలను రైతు సేవా కేంద్రాల ద్వారా అందిస్తున్నారు. ★ పశువుల ఆరోగ్య సంరక్షణకు జాతీయ పశువ్యాధి నివారణ కార్యక్రమంలో టీకాలు వేస్తున్నారు. ఈ వివరాలన్నీ భారత్ పశుధాన్ యాప్‌లో నమోదు చేస్తున్నామని పశుసంవర్ధకశాఖ ఏడీ వైవీ.రమణ తెలిపారు. ★ జంతు సంక్షేమానికి, వాటి హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నామని, జంతు సంక్షేమ చట్టాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని వెల్లడించారు.

జిల్లాలో..

బహుళార్థ సాధక పశువుల ఆసుపత్రి	1
వెటర్నరీ క్లినికల్ కాంప్లెక్స్	1
ప్రాంతీయ పశువైద్య కేంద్రాలు	13
పశు వైద్యశాలలు	65
గ్రామీణ పశు వైద్యశాలలు	40
ప్రాంతీయ పశువ్యాధి నిర్ధారణ కేంద్రాలు	6

అబ్కారీశాఖ ఏసీగా పైడా



నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: అబ్కారీ, ప్రొహిబిషన్ శాఖ అసిస్టెంట్ కమిషనర్(ఏసీ)గా పైడా రామచంద్రరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు నుంచి ఆయన బదిలీపై వచ్చారు. గతంలో విజయనగరంలో ఇదే హోదాలో పనిచేశారు.

తపాలా బిల్లల సేకర్తకు అరుదైన గౌరవం



ప్రసాద్‌ను సత్కరిస్తున్న మంత్రి అశ్వినీకుమార్ చౌబే

చీపురుపల్లి, న్యూస్‌టుడే: ప్రపంచవ్యాప్తంగా గాంధీజీపై విడుదలైన తపాలా బిల్లలను సేకరించి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం పొందిన చీపురుపల్లికి చెందిన ఏడీఎన్ఎస్‌వీ.ప్రసాద్‌ను దిల్లీలో గురువారం సత్కరించారు. ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ అంతర్జాతీయ స్నాతకోత్సవం, 3వ సెల్ఫీ సైన్స్ మ్యూజియం ప్రారంభోత్సవం సందర్భంగా ఆయనను ఆహ్వానించారు. కేంద్ర అటవీ, ఆహార, ప్రజాపంపిణీ, పర్యావరణ శాఖల మంత్రి అశ్వనీ కుమార్ చౌబే సత్కరించి అభినందించారు.

వచ్చేనెలలో పత్తి కొనుగోలు

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో వచ్చేనెల రెండో తేదీ నుంచి పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేలా ఏర్పాట్లు చేయాలని సంయుక్త కలెక్టర్ సేధు మాధవన్ అధికారులను ఆదేశించారు. మండలాల వారీగా రైతుల జాబితాను సిద్ధం చేయాలన్నారు. తన ఛాంబర్లో గురువారం సంబంధిత అధికారులతో సమీక్షించారు. రాజాం, రామభద్రపురంలో కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అన్నదాతలు పంటను కేంద్రాలకు తీసుకొచ్చి, కనీసమద్దతు ధరను పొందేలా చూడాలని కోరారు. మార్కెటింగ్ శాఖ ఏడీ రవికుమార్, అగ్నిమాపక అధికారి రామ్‌ప్రకాష్, తూనికలు కొలతలశాఖ ఏసీ పి.వి.రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టెట్ పరీక్షలు ప్రారంభం

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యా అర్హత పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. తొలి రోజు ఉదయం నాలుగు కేంద్రాలు, మధ్యాహ్నం మూడు కేంద్రాల్లో పేపర్- 2ఎ(తెలుగు) నిర్వహించారు. 1610 మందికి గానూ 1466 మంది హాజరైనట్లు డీఈవో ప్రేమకుమార్ తెలిపారు.

పూర్తిస్థాయిలో హామీల అమలు: నాగార్జున



మాట్లాడుతున్న కిమిడి, చిత్రంలో ఐవీపీ తదితరులు

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు కూటమి ప్రభుత్వం సూపర్- 6 పథకాలను పక్కాగా అమలు చేస్తోందని తెదేపా జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున అన్నారు. విజయనగరంలోని అశోక్‌బంగ్లాలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వంద రోజుల పాలనలో ఏమీ సాధించలేదంటూ జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు వ్యాఖ్యానించడం విడ్డూరంగా ఉందన్నారు. గత అయిదేళ్లలో ప్రజలకు ఏమీ చేయనందునే 151 నుంచి 11 సీట్లకు పడిపోయారని ఎద్దేవా చేశారు. 2019 ఎన్నికల్లో ఫించను మొత్తాన్ని రూ.3 వేలు చేస్తామని ప్రకటించి.. కాలం గడిపేశారని ఆరోపించారు. తాము అధికారంలోకి రాగానే పెద్దమొత్తంలో పెంచి ఇస్తున్నామని గుర్తు చేశారు. కక్షపూరితంగా మూసేసిన అన్న క్యాంటీన్లను పునరుద్ధరించామన్నారు. భోగాపురంలో విమానాశ్రయ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. వాస్తవాలు వక్రీకరించొద్దని హితవు పలికారు. నాయకులు ఐవీపీ.రాజు, విజ్జపు ప్రసాద్, ముద్దాడ చంద్రశేఖర్, రొంగలి పోతన్న, రెడ్డి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	128	226	236

ప్రియురాలితో వచ్చి.. గంజాయితో పట్టుబడి



సరకుతో పోలీసులు

విజయనగరం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: విజయనగరంలోని రైల్వేస్టేషన్ సమీపంలో 21 కిలోల గంజాయితో పశ్చిమ బెంగాల్‌కు చెందిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామని డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మంజూర్ అలీ సరకు కొనేందుకు ఇటీవల ఒడిశా రాష్ట్రం కొరాపుట్‌కు తన ప్రియురాలితో కలిసి వెళ్లాడు. గురువారం ఉదయం రైలులో విజయనగరం రైల్వే స్టేషన్‌కు చేరకున్నాడు. ఇక్కడి నుంచి ముషీరాబాద్ వెళ్లే రైలు ఎక్కాలనుకున్నాడు. ఈలోపు అల్పాహారం తినేందుకు బయటకు వచ్చాడు. ముందుగానే సమాచారం అందుకున్న పోలీసులు అతని బ్యాగులను తనిఖీ చేయగా.. గంజాయి దొరికింది. సరకుతో పాటు రెండు చరవాణులు, రూ.500 నగదును స్వాధీనం చేసుకున్నామని, అతని ప్రియురాలు తప్పించుకుందని చెప్పారు. సీఐ ఎస్.శ్రీనివాస్, ఎస్సై నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి డబ్బులివ్వలేదని చోదకుడి బలవన్మరణం

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఉరేసుకుని ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన సాలూరు మండలం జీగిరాం గ్రామ శివారులోని మామిడితోటలో జరిగింది. గ్రామీణ ఎస్సై నరసింహమూర్తి వివరాల ప్రకారం.. పాచిపెంట మండలం చొక్కాపువానివలసకు చెందిన కె.నందేశ్వరరావు(21) ఆటో చోదకుడు. మద్యానికి బానిసై భార్య నందినితో తరచూ గొడవ పడుతుండేవాడు. గురువారం మద్యం తాగడానికి భార్యను డబ్బులు అడగ్గా.. ఆమె నిరాకరించడంతో ఆటోతో జీగిరాం శివారుకు వెళ్లి చెట్టుకు ఉరేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. స్థానికుల సమాచారంతో పోలీసులు చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేశామని ఎస్సై చెప్పారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



గుర్ల, న్యూస్‌టుడే: గుర్లలోని పెద్దఖానాలు సమీపంలో గురువారం ఓ ఆర్టీసీ బస్సు అదుపు తప్పింది. విజయనగరం నుంచి చీపురుపల్లి వైపు వెళ్తుండగా.. ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో పొలాల్లోని వెళ్లబోయింది. చోదకుడి చాకచక్యంతో రోడ్డు ఒడ్డున ఆగిపోయింది. 40 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు.

ఎంపీడీవోలకు పోస్టింగులు

పార్వతీపురం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో 25 మండలాలకు కొత్త ఎంపీడీవోలను నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అంతర జిల్లాల బదిలీ నేపథ్యంలో ఇక్కడకు వచ్చిన వారికి స్థానాలు కేటాయించారు. జిల్లా నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి స్థానాల్లో కొత్తవారిని నియమించారు.

పార్వతీపురం మన్యంలో..

మండలం	ఎంపీడీవో
పాచిపెంట	ఉమామహేశ్వరి
జియ్యమ్మవలస	రమామణి
సీతానగరం	త్రివిక్రమరావు
పార్వతీపురం	కె.రూపేష్
కురుపాం	వై.పద్మజ
మక్కువ	డి.స్వరూపరాణి
సాలూరు	ఎ.రమాదేవి

విజయనగరం జిల్లాలో..

మండలం	ఎంపీడీవో
శృంగవరపుకోట	ఎం.సతీష్
జామి	అప్పలనాయుడు
వేపాడ	సూర్యనారాయణ
ఎల్.కోట	ఎస్.అప్పారావు
కొత్తవలస	ఎస్.రమణయ్య
గజపతినగరం	బి.కల్యాణి
దత్తిరాజేరు	రాజేంద్రప్రసాద్
గంట్యాడ	రమణమూర్తి
నెల్లిమర్ల	కె.ఆర్.కె.రాజు
భోగాపురం	కె.కిశోర్‌కుమార్
డెంకాడ	వై.భవాని
గరివిడి	సుబ్రమణ్యం
మెరకముడిదాం	జి.భాస్కరరావు
గుర్ల	కె.సురేష్‌బాబు
రామభద్రపురం	ఎం.రత్నం
బాడంగి	ఎస్.రామకృష్ణ
తెర్లాం	ఆర్.రాంబాబు
మెంటాడ	పట్నాయక్

నాలుగు జిల్లాల దారిలో నరకయాతన

విజయనగరం, శ్రీకాకుళం, మన్యం, విశాఖ జిల్లాలకు అనుసంధానంగా ఉన్న సంతకవిటి- పొందూరు ఆర్అండ్‌బీ ప్రధాన రహదారి గత నెలలో వచ్చిన వరదలకు కొట్టుకుపోయింది. యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ మార్గంలో ప్రయాణం నరకంలా మారింది. సిరిపురం- లైదాం గ్రామాల మధ్య ఉన్న రెల్లిగెడ్డకు సెప్టెంబరులో వచ్చిన వరదలతో కల్వర్టు, రహదారి కోతకు గురై కొట్టుకుపోయాయి. ఈ గెడ్డ సంతకవిటి మండలం, శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలాల సరిహద్దులో ఉంది. రెండు జిల్లాల ఆర్అండ్‌బీ శాఖ అధికారులు తమ పరిధి కాదంటూ వదిలేశారు. తాత్కాలిక మరమ్మతులైనా చేపడితే ప్రయాణం కొంత సులువవుతుందని వాహన చోదకులు అభిప్రాయపడుతున్నారు. దీనిపై ర.భ.శాఖ ఏఈ ఆంజనేయనాయకర్‌ను వివరణ కోరగా.. రెల్లిగెడ్డపై ఉన్న వంతెన సంతకవిటి మండల పరిధిలో ఉన్నా.. మండలాధికారులు మాత్రం పొందూరు పరిధిగా చెబుతున్నారన్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని చెప్పారు. అధికారుల సూచన మేరకు శాశ్వత మరమ్మతు పనులకు రూ.25 లక్షలు అవసరమని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపించామన్నారు. తాత్కాలిక మరమ్మతులకు రూ.2 లక్షలు మంజూరు చేయాలని కలెక్టరును కోరామన్నారు. – న్యూస్‌టుడే, సంతకవిటి




వరదనీటి ప్రవాహానికి దెబ్బతిన్న కల్వర్టు



రెల్లిగెడ్డ ఉద్ధృత ప్రవాహంతో కొట్టుకుపోయిన ప్రధాన రహదారి

విద్యార్థులకు అపార్ కార్డు



కొత్తవలస, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థికీ జాతీయ స్థాయిలో 'వన్ నేషన్ - వన్ ఐడీ' పేరుతో 17 అంకెలుండే గుర్తింపు కార్డు ఇవ్వడానికి కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. 'ఆధార్' తరహాలోనే 'అపార్' (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) పేరుతో దీనికి రూపకల్పన చేశారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లోని కేజీ నుంచి పీజీ వారికి ఇకపై ఈ కార్డు అందుబాటులోకి రానుంది. ముందుగా 9, 10 తరగతుల వారికి వీటిని జారీ చేయాలని నిర్ణయించారు. ఈమేరకు తల్లిదండ్రుల నుంచి అనుమతి పత్రం తీసుకోవాలని విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశించడంతో జిల్లాలో ప్రక్రియను ప్రారంభించారు. దసరా సెలవులకు ముందురోజు తల్లిదండ్రులకు అనుమతి పత్రం ఇచ్చి, దీనివల్ల కలిగే ఉపయోగాలను తెలియజేశారు. సెలవుల అనంతరం 14వ తేదీన ఈ పత్రాలను పాఠశాలల్లో అందజేయాలని స్పష్టం చేశారు.

ప్రయోజనాలివీ..

విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, లింగం, ఫొటో, క్యూఆర్ కోడ్, 17 అంకెలతో కూడిన గుర్తింపు నంబరు డిజిటల్ కార్డులో ఉంటాయి. ఈ ప్రత్యేక సంఖ్యను నమోదు చేస్తే విద్యార్థి కుటుంబ వివరాలు, మార్కుల ధ్రువపత్రాలు తదితర వివరాలన్నీ తెలుసుకోవచ్చు. ప్రవేశ పరీక్షల దరఖాస్తులోనూ ఈ సంఖ్యను నమోదుచేస్తే సరిపోతుంది. అకడమిక్ పరంగా జీవితకాల గుర్తింపు కార్డుగా దీన్ని పరిగణిస్తారు. ఎల్‌కేజీలో చేరినప్పటి నుంచి విద్యాభ్యాసం పూర్తయ్యే వరకు అన్ని వివరాలు ఇందులో ఉండనున్నాయి. దీనిని ఆధార్ సంఖ్యతో పాటు అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్(ఏబీసీ) అనే ఎడ్యులాకర్‌కు అనుసంధానిస్తారు. విద్యార్థి బ్యాంకు ఖాతా (అకడమిక్), డీజీ లాకర్‌తో అనుసంధానమై ఉంటుంది. గుర్తింపు కార్డులకు అడిగిన సమాచారం ఇవ్వాలని తల్లిదండ్రుల సమ్మతిని కోరుతూ సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పత్రాలను పంపారని కొత్తవలస ఎంఈవో బి.శ్రీనివాసరావు చెప్పారు. డీఈవో ప్రేమకుమార్ ఆదేశాల ప్రకారం ముందుకెళ్తున్నామని పేర్కొన్నారు.

తాటిపూడి నీరు విడుదల

గంట్యాడ, న్యూస్‌టుడే: తాటిపూడి జలాశయం గరిష్ఠ నీటిమట్టం 297 అడుగులు కాగా బుధవారం రాత్రికి 296 అడుగులకు చేరువ కావడంతో గురువారం జలవనరుల శాఖ అధికారులు స్పిల్‌వే ద్వారా నీటిని విడుదల చేశారు. లోతట్టు గ్రామాలను అప్రమత్తం చేసి, సైరన్ మోగించి కిందకు విడిచిపెట్టామని ఏఈ తమ్మునాయుడు తెలిపారు.

సౌందర్య షాపీ ప్రారంభం

విజయనగరం పట్టణం: నగరంలోని పూల్‌బాగ్ రోడ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సౌందర్య షాపీ 2వ బ్రాంచును మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి గురువారం ప్రారంభించారు. అన్నిరకాల ఎలక్ట్రానిక్ గృహోపకరణాలు తమ వద్ద ఉంటాయని సంస్థ అధినేత ఎస్.సంకీర్త్ తెలిపారు.



రిబ్బను కత్తిరిస్తున్న వీరభద్రస్వామి

ఏనుగుల రాకతో ఆందోళన


రంగలగూడ తోటలో కరిరాజు

పార్వతీపురం గ్రామీణం, కొమరాడ, న్యూస్‌టుడే: ఇన్నాళ్లు కురుపాం నియోజకవర్గంలో సంచరించిన ఏనుగులు గురువారం పార్వతీపురం చేరుకున్నాయి. కొమరాడ మండలం నుంచి కృష్ణపల్లి పంచాయతీ బండిదొరవలస మీదుగా చినమరికి, రావికూడ వెళ్లాయి. చివరికి రంగలగూడ టేకు తోటల్లో తిష్ఠ వేశాయి. గతంలో ఇక్కడ నష్టాలు మిగిల్చిన ఏనుగులు మళ్లీ రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రత్యేక రేంజర్ మణికంఠ నేతృత్వంలో అటవీ సిబ్బంది, ట్రాకర్లు పర్యవేక్షిస్తున్నారు. ఏనుగులు గ్రామాలకు దూరంగా ఉండేలా చర్యలు చేపడుతున్నామని జిల్లా అటవీ శాఖ అధికారిణి ప్రసూన తెలిపారు.

రూ.5 లక్షలతో ఆసుపత్రిలో సౌకర్యాలు

జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: మండలంలోని చినమేరంగి సామాజిక ఆసుపత్రి అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేద్దామని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. గురువారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం అందించే రూ.5 లక్షలతో సౌకర్యాలు కల్పించాలని, రోగులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. మూడేళ్లుగా విధులకు రాకుండా కాపలదారు వేతనం తీసుకున్నట్లు గుర్తించారు. చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎంపీపీ బి.సురేష్, కమిటీ సభ్యులు ఎం.మురళి, ఆర్.సింహాచలం, జి.రాణి, ఆసుపత్రి పర్యవేక్షకుడు డా.టి.కె.సునీల్‌కుమార్, వైద్యులు అభినయ్‌స్వామి, రమ్య, చంద్రవర్మ, ప్రభుతేజ, కృష్ణచైతన్య, హెడ్‌నర్సు పార్వతి ఉన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్వరి, ఎంపీపీ సురేష్, అధికారులు

రహదారులు మెరుగుపడాలి

పాలకొండ, న్యూస్‌టుడే: పాలకొండ నియోజకవర్గంలో అన్ని గ్రామాల రహదారులు మెరుగుపడాలని ఎమ్మెల్యే ఎన్.జయకృష్ణ సూచించారు. గురువారం పార్టీ కార్యాలయంలో ర.భ.శాఖ అధికారులతో సమీక్షించారు. గత ప్రభుత్వ హయాంలో ఎలాంటి అభివృద్ధి జరగక గ్రామీణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. వీటికి అవసరమైన ప్రతిపాదనలు పంపించాలన్నారు. డీఈ జగన్నాథరావు, ఏఈ పి.కిరణ్‌కుమార్ ఉన్నారు.


అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

పార్వతీపురం	8008566244
పాలకొండ	8008574299
సాలూరు	8008786820
కురుపాం	9849044696

? సీతానగరంలోని నీలాటి రేవులకు వెళ్లే దారి పనికిరాని మొక్కలతో నిండిపోయింది. రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. - **రామకృష్ణ**

❖ పనికిరాని మొక్కలు తొలగిస్తాం. - **రమేష్, ఈవో, పెదభోగిల – సీతానగరం**

? అడ్డాపుశీల పంచాయతీ సచివాలయం సమీపంలో కాలువపై పలకలు విరిగాయి. మురుగు నిలిచిపోవడంతో దుర్వాసన వస్తోంది. - **స్థానికులు, అడ్డాపుశీల**

❖ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - **జీవీఆర్.నాయుడు, ఈవోపీఆర్డీ**

– న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం

గుంత పూడ్చివేత

స్పందనకు వందనం

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పాలకొండ నీలమ్మకాలనీ కూడలిలో కొన్ని నెలలుగా ఉన్న పెద్ద గుంతను నగర పంచాయతీ సిబ్బంది గురువారం పూడ్చారు. దీంతో రాకపోకలకు ఇబ్బందులు తొలగాయి. నీలమ్మ ఆలయం ఎదురుగా ఉన్న గొయ్యి ప్రమాదకరంగా మారిందని 'ఈనాడు'లో ఈ నెల 1న చిత్రవార్త ప్రచురితమైంది. నగర పంచాయతీ ఏఈ దేవిశ్రీప్రసాద్ స్పందించి చర్యలు చేపట్టారు.

అభివృద్ధికి అంచనాలు

రైతుల్లో ఆశలు

రూ.20 కోట్లతో సాగునీటి వనరుల మరమ్మతులు

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: కర్షకుల సాగునీటి కష్టాలు తీర్చాలన్న ఉద్దేశంతో నిర్మించిన వనరులు గత వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యానికి నీరుగారి పోయాయి. కొత్త నిర్మాణాల సంగతి పక్కన పెడితే ఉన్నవాటి ఆధునికీకరణకు నిధులు మంజూరు చేయకుండా వదిలేశారు. దీంతో మన్యంలోని చిన్న నీటి వనరులే ఆధారంగా పంటలు పండించిన రైతులు అనేక ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం చెక్‌డ్యామ్‌లు, జలాశయాలను బాగు చేసేలా అడుగులు వేస్తోంది.


కె.శివడ సమీపంలో పూడికతో నిండిన చెక్‌డ్యామ్

శిథిలావస్థలో చెక్‌డ్యామ్‌లు..

కురుపాం నియోజకవర్గంలో ఐటీడీఏ, నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో సుమారు 300 వరకు చెక్‌డ్యామ్‌లు నిర్మించారు. వీటి ద్వారా 20 వేల ఎకరాలకు సాగు నీరు అందించాల్సి ఉంది. కానీ గత అయిదేళ్లలో చాలా చోట్ల నిర్మాణాలు శిథిలావస్థకు చేరాయి. సుమారు 160 వరకు చిన్న, పెద్ద పంట కాలువలున్నాయి. వీటి ద్వారా 18 వేల ఎకరాలకు నీరు వెళ్లాలి. పూడికలు, తుప్పలు పెరగడంతో వాటి ఆనవాళ్లే కనుమరుగయ్యాయి. వీటి బాగుకు 2022లో సుమారు రూ.6 కోట్లతో ప్రతిపాదనలు పంపించినా నిధులు మాత్రం రాలేదు.


అసంపూర్తిగా ఉన్న రేగిడి గెడ్డ అనుసంధాన పనులు

డిసెంబరులో పనులకు అవకాశం..

వృథా జలాలు ఒడిసి పట్టేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. కురుపాం డివిజన్ పరిధిలో మరమ్మతులకు గురైన చెక్‌డ్యామ్‌లు, జలాశయాలు, కాలువలు, చెరువులను గుర్తించారు. వీటి అభివృద్ధికి సుమారు రూ.20 నుంచి రూ.30 కోట్లతో అంచనాలు తయారు చేస్తున్నారు. గుమ్మిడి గెడ్డ కాలువల ఆధునికీకరణ, రేగిడి నుంచి ఒట్టిగెడ్డ అనుసంధానం, గుజ్జువాయి మినీ జలాశయం పనులు చేపట్టనున్నారు. ఒట్టిగెడ్డ ఆధునీకరణకు రూ.47 కోట్లు మంజూరైనా కేవలం రూ.3 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. మిగిలిన నిధులతో డిసెంబరు నుంచి పనులు ప్రారంభించనున్నారు.

ప్రతిపాదనలు చేపడుతున్నాం..

శిథిలమైన చెక్‌డ్యామ్‌లు, ఇతర సాగునీటి వనరులను గుర్తించాం. గుమ్మిడిగెడ్డ కాలువల నిర్వహణ, రేగిడి గెడ్డ పనుల పూర్తికి అంచనాలు తయారు చేసి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. నిధులు మంజూరైతే పనులు ప్రారంభిస్తాం. – **రవికుమార్, జలవనరులశాఖ డీఈఈ**

ప్రధాన రహదారికి మోక్షం

పాచిపెంట, న్యూస్‌టుడే: పాచిపెంట గ్రామ ప్రధాన రోడ్డుకు మోక్షం కలిగింది. దశాబ్దాల కిందట నిర్మించిన సిమెంటు రోడ్డు పూర్తిగా పాడై గ్రామస్థులు, వాహనదారులు అవస్థలు పడ్డారు. సర్పంచి సంతోషి, పాలకవర్గ సభ్యులు స్పందించారు. పంచాయతీ ఆర్థిక ప్రణాళిక నిధులతో సామాజిక భవనం కూడలి నుంచి కల్కి భగవాన్ ఆలయం వరకు 200 మీటర్ల పొడవున రహదారి నిర్మాణం పూర్తి చేశారు.


పూర్తయిన నిర్మాణం

అక్రమాలపై దర్యాప్తునకు ఆదేశం

పార్వతీపురం పట్టణం, పురపాలిక, న్యూస్‌టుడే: పార్వతీపురం పట్టణ ప్రణాళిక విభాగంలో అక్రమాలు జరిగాయంటూ వచ్చిన ఆరోపణలపై దర్యాప్తునకు ఆదేశించినట్లు ఎమ్మెల్యే బి.విజయచంద్ర పేర్కొన్నారు. సదరు అధికారితో నష్టపోయిన వారు ఎవరైనా ఉంటే స్వచ్ఛందంగా వచ్చి సమస్యలను తెలియజేయాలని వెల్లడించారు. దీనిపై పుర కమిషనర్ పి.శ్రీనివాస్ వద్ద ప్రస్తావించగా దర్యాప్తు అధికారిగా పుర డీఈ కిరణ్‌కుమార్‌ను నియమించామని చెప్పారు. విరుద్ధంగా భవనాలు నిర్మించిన యజమానులకు నోటీసులు జారీ చేశామన్నారు.

ఉక్కును కాపాడుకుందాం

కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరు విశాఖ ఉక్కు కర్మాగారాన్ని నిర్వీర్యం చేసేలా ఉందని ఏపీ రైతు, వ్యవసాయ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.కృష్ణమూర్తి, బి.అప్పలనాయుడు అన్నారు. కలెక్టరేట్ వద్ద విశాఖ ఉక్కు పరిరక్షణ దీక్షకు మద్దతు పలికారు. ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. ప్రైవేటీకరణ ఆలోచన విరమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బి.దాసు, జి.వెంకటరమణ, ఆర్.శ్రీదేవి, ఇందిర, కె.గంగునాయుడు, ఆర్.ఈశ్వరరావు, బి.గౌరునాయుడు తదితరులు పాల్గొన్నారు.


శిబిరంలో కూర్చున్న ప్రజా సంఘాల నాయకులు

అమ్మ పరమేశ్వరి.. జనని జగదీశ్వరి


పార్వతీపురం రెడ్డి వీధిలో మండపంలో దుర్గాదేవి

దసరా నవరాత్రి ఉత్సవాలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారిని ఆలయాలు, మండపాల్లో వివిధ రూపాల్లో అలంకరించి భక్తులు ఉదయం నుంచే పూజలు చేశారు. – న్యూస్‌టుడే, బృందం


సాలూరులో లలితాదేవి


కోటదుర్గమ్మ సన్నిధిలో పర్యవేక్షిస్తున్న ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి, కమిటీ సభ్యులు


అలంకరణలో పురటాల పోలమాంబ


పార్వతీపురంలో దర్శించుకుంటున్న ఎమ్మెల్యే విజయచంద్ర


పాలకొండ కోటదుర్గ సన్నిధిలో పూజలు చేస్తున్న భవానీ భక్తులు


స్వర్ణాలంకరణలో సీతంపేట సంతోషిమాత


గంగరేగువలసలో దుర్గమ్మ

రాత్రి పది తర్వాత సర్వీసులు

కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి పాతబస్టాండ్‌కు రాత్రి 10 తర్వాత బస్సులు వెళ్లక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని డీఎం దుర్గ దృష్టికి ఎమ్మెల్యే విజయచంద్ర ఇటీవల తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో ఈ నెల 7 నుంచి విశాఖ నుంచి పార్వతీపురం వచ్చే బస్సులు రాత్రి 10 తర్వాత పాతబస్టాండ్ వరకు వెళ్లేలా చర్యలు చేపట్టినట్లు డీఎం తెలిపారు.

కంకర ట్రాక్టర్లు స్వాధీనం

వీరఘట్టం, న్యూస్‌టుడే: మండలంలోని రేగులపాడు సమీపంలో అక్రమంగా కంకర తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు, ఒక పొక్లెయిన్‌ను పట్టుకున్నట్లు తహసీల్దారు సత్యనారాయణ తెలిపారు. అందిన సమాచారం మేరకు.. ఆర్ఐ ఎన్.లక్ష్మునాయుడు, వీఆర్వోలు కీర్తిసుధ, సాయి, వీఆర్ఏ జగన్నాథంనాయుడు నిఘా వేసి పట్టుకున్నట్లు చెప్పారు. అనుమతులు లేకుండా తవ్వకాలు జరిగినట్లు గుర్తించి, వాహనాలను పోలీసులకు అప్పగించామన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మైనింగ్ అధికారులకు కోరుతామన్నారు.

పేద కుటుంబానికి సాయం

పార్వతీపురం గ్రామీణం: కొత్తఊరుకు చెందిన గోపాలరావు జంఝావతిలో చేపల వేటకు వెళ్లి మృతి చెందారు. ఆయన భార్య గర్భిణి. రోజువారీ పోషణ కష్టంగా మారడంతో పలువురు అండగా నిలిచారు. పెదబొండపల్లికి చెందిన శ్రీనివాసరావు, పట్టణానికి చెందిన ఎ.శ్రీను, బి.రామకృష్ణ, రెడ్‌క్రాస్ సభ్యులు దుస్తులు, బియ్యం, నగదు అందజేశారు.

పాసుల జారీ నిలిపివేత

కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: వెబ్‌సైట్ ఆధునికీకరణలో భాగంగా ఈ నెల 5, 6 తేదీల్లో విద్యార్థులు, ప్రయాణికులకు ఆర్టీసీ బస్సు పాసుల జారీ నిలిపివేస్తున్నట్లు పార్వతీపురం డీఎం దుర్గ తెలిపారు. 7 నుంచి మళ్లీ యథావిధిగా జారీ చేస్తామన్నారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం

సాలూరు గ్రామీణం, మక్కువ, న్యూస్‌టుడే: సాలూరు మండలం మామిడిపల్లి, మావుడి, గంగన్నదొరవలసతో పాటు మక్కువ, పాచిపెంట మండలంలోని గురువినాయుడుపేటలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్తు సరఫరా ఉండదని ఈపీడీసీఎల్ డీఈఈ గోపాలరావునాయుడు తెలిపారు. ❖ పార్వతీపురం పురపాలక: పార్వతీపురం విద్యుత్తు సబ్‌స్టేషన్ పరిధిలోని గూడ్స్‌షెడ్ రోడ్డు నుంచి వైకేఎం నగర్ వరకు విద్యుత్తు సరఫరా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిలిపి వేస్తున్నట్లు ఏఈ మురళీధర్ తెలిపారు. ❖ పాలకొండ గ్రామీణం: పాలకొండ గజలాఖానా నుంచి తుమరాడ వరకు శుక్రవారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ టీజీకే మూర్తి తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపి వేస్తున్నట్లు చెప్పారు.

రారెత్తిస్తున్న టమాటా

జిల్లా కేంద్రంలో టమాటా ధరలు వినియోగదారులకు రారెత్తుస్తున్నాయి. కొన్ని రోజులుగా ధర అమాంతంగా పెరగడంతో సామాన్యులు ఆందోళన చెందుతున్నారు. ఇన్నాళ్లు కిలో రూ.30 నుంచి 40 మధ్య ఉండగా.. గురువారం రైతుబజారులో కిలో రూ.62, బయట కిలో రూ.80 చొప్పున పలికింది. స్థానికంగా పంట అందుబాటులో లేకపోవడంతో ఇతర జిల్లాల నుంచి దిగుమతి చేస్తున్నారు. ఇటీవల తుపానుతో పంట దెబ్బతినడం, సరిపడా అందుబాటులో లేక ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. దసరా ముగిసే వరకు ఇదే పరిస్థితి ఉండే అవకాశం ఉందన్నారు. – న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం



జిల్లా స్థాయి కరాటేలో పతకాలు

పార్వతీపురం పట్టణం, గ్రామీణం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా పాఠశాల క్రీడల్లో అండర్-14, 17 విభాగం కరాటే పోటీల్లో జిల్లా విద్యార్థులు పతకాలు సాధించినట్లు శిక్షకుడు గోపాల్ తెలిపారు. రెండు విభాగాల్లో ఏడు స్వర్ణాలు, అయిదు రజతాలు గెలిచారన్నారు. డి.యోగీశ్వరి, జి.దివ్యంజలి, కె.శరణ్య, హెచ్.నాని, అనూష, ఎన్.సుహాసిని, వినీలా, బి.అమల, జి.ఆకాంక్ష, రాహుల్, వినీత, చరణ్‌ను పలువురు అభినందించారు.


నిర్వాహకులతో జిల్లాకు చెందిన క్రీడాకారులు

ఆలయానికి వితరణ

కురుపాం గ్రామీణం: గుమ్మలోని శ్రీ నీలంకంఠేశ్వర ఆలయానికి హైదరాబాద్‌కు చెందిన బి.శ్రీనివాసరావు రూ.18 వేలు విలువైన మైక్‌సెట్‌ను వితరణగా ఇచ్చారు. గ్రామపెద్దలు వి.భారతి, అర్చకులు, గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

సబ్‌కలెక్టరుకు వినతి

పాలకొండ గ్రామీణం: పాలకొండ పరిధిలోని అరదలి, లంబూరు నుంచి పెదకోటిపల్లి వెళ్లేందుకు రహదారి సౌకర్యం కల్పించాలని ఎంపీపీ బి.భాను, లుంబూరు సర్పంచి ఉపేంద్ర సబ్‌కలెక్టరు యశ్వంత్‌కుమార్ రెడ్డికి గురువారం విన్నవించారు.

ప్రాధాన్య పనులపై దృష్టి

భామిని: ఉపాధి హామీ పథకంలో ప్రాధాన్య పనులు గుర్తించాలని ఏపీవో తులసీదాస్ అన్నారు. కోసలిలో ఉపాధి హామీ గ్రామ సభ నిర్వహించారు. ఎంపీటీసీ మోహనరావు తదితరులు ఉన్నారు.

బస్సులో 21 కిలోల గంజాయి

భామిని: అక్రమంగా తరలిస్తున్న 21 కిలోల గంజాయిని బత్తిలి చెక్ పోస్టు వద్ద పట్టుకున్నట్లు ఎస్సై డి.అనీల్ కుమార్ తెలిపారు. వాహన తనిఖీల్లో భాగంగా ఒడిశా రాష్ట్రం గుణుపుర్ మీదుగా బత్తిలి వైపు వస్తున్న ప్రైవేట్ బస్సును తనిఖీ చేయగా మహారాష్ట్రకు చెందిన రోహన్ హరిశ్చంద్ర కాలే అనే వ్యక్తి పది ప్యాకెట్లలో గంజాయి తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారించి కేసు నమోదు చేశామన్నారు.

ఎస్సైగా నారాయణరావు

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: కురుపాం ఎస్సైగా పి.నారాయణరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పార్వతీపురం వీఆర్ నుంచి వచ్చారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చూస్తామని చెప్పారు.

బాధ్యతల అప్పగింత

పార్వతీపురం: పార్వతీపురం గిరిజన సంక్షేమ డీడీ రుక్మాంగదయ్యను విధుల నుంచి గురువారం రిలీవ్ చేశారు. ఆయన స్థానంలో సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి గయాజుద్దీన్‌కు ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాత్సవ్ బాధ్యతలు అప్పగించారు.

మహిళ మృతదేహం లభ్యం

వీరఘట్టం: వీరఘట్టం వట్టిగెడ్డలో నాలుగు రోజుల క్రితం గల్లంతైన పట్టణానికి చెందిన ఓ మహిళ (50) మృతదేహం గురువారం లభ్యమైంది. ఈమె ఏడాది నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నారు. నాలుగు రోజుల క్రితం వట్టిగెడ్డకు వెళ్లి కాలుజారి పడిపోయి ప్రవాహంలో కొట్టుకుపోయారు.

మొక్కజొన్న పంట పరిశీలన

మక్కువ: మండలంలోని నంద గ్రామంలో మొక్క జొన్న పంట నష్టపోయిన రైతులను ఏడీఏ ఎ.మధుసూదనరావు కలిశారు. విత్తన కంపెనీకి చెందిన ప్రతినిధులు, డీలర్లు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సుమారు 19 హెక్టార్లలో పంట నష్టం జరిగిందని జిల్లా వ్యవసాయాధికారి దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారు.

కోటదుర్గ ఉత్సవాలకు ఆహ్వానం

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పాలకొండ కోటదుర్గమ్మ ఉత్సవాలకు హాజరు కావాలని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌ను కమిటీ సభ్యులు ఎస్.సంతోష్, రుద్ర కోటేశ్వరరావు ఆహ్వానించారు. శ్రీకాకుళంలో వారిని కలిసి అమ్మవారి చిత్రపటం, ఆహ్వాన పత్రికలు అందజేశారు.

ప్రైవేటు ఉపాధ్యాయుడికి ఐదేళ్ల జైలు

గౌతంనగర్, న్యూస్‌టుడే: విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయుడికి గురువారం పోక్సో కోర్టు జైలు శిక్ష, జరిమానా విధించినట్లు మల్కాజిగిరి ఠాణా సీఐ సత్యనారాయణ తెలిపారు. కొమరాడ మండలానికి చెందిన వెంకటరమణ(40) మౌలాలి పరిధిలోని ఓ పాఠశాలలో 2016లో ఉపాధ్యాయుడిగా పనిచేశారు. అక్కడ పదో తరగతి విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో మల్కాజిగిరి పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం స్పెషల్ పోక్సో కోర్టు వెంకటరమణకు అయిదేళ్లు జైలు, రూ.5వేల జరిమానా విధించింది. బాలికకు రూ.25 వేలు చెల్లించాలని తీర్పు ఇచ్చింది.

రామాయణ జ్ఞానయజ్ఞం

పాలకొండ గ్రామీణం: వాటపాగులో రామాయణ జ్ఞానయజ్ఞ సప్తాహ వేడుకలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 10 వరకు 168 గంటల పాటు హరే రామ హరేకృష్ణ నామ సంకీర్తన చేపడతామన్నారు.

పొలం పిలుస్తోంది

సీతంపేట, న్యూస్‌టుడే: మండలంలోని పనసగూడ, కె.గుమ్మడలో ఏవో పి.శ్రీదేవి, ఉద్యాన అధికారిణి పి.జయశ్రీ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం గురువారం నిర్వహించారు సాగు విధానం గురించి రైతులకు వివరించారు.

పోలింగ్ కేంద్రాలకు ప్రతిపాదన

పార్వతీపురం, న్యూస్‌టుడే: రాజకీయ పార్టీల నుంచి వచ్చిన వినతుల మేరకు జిల్లాలో కొత్తగా రెండు పోలింగు కేంద్రాల ఏర్పాటుకు ఎన్నికల సంఘానికి ప్రతిపాదనలు పంపించామని ఇన్‌ఛార్జి డీఆర్వో జి.కేశవనాయుడు తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. కురుపాం, పార్వతీపురం నియోజకవర్గాల్లోని బొత్తిలి, రాయివలసలో ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఓటరు జాబితా సవరణకు కోసం 6, 7, 8 ఫారాలు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 5,140 దరఖాస్తులు వచ్చాయని, 219 తిరస్కరణకు గురయ్యాయన్నారు.


రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చిస్తున్న కేశవనాయుడు

పాత పాలసీ విధానాలతో మేలు


నిరసన తెలుపుతున్న ఏజెంట్లు

పార్వతీపురం పురపాలక, న్యూస్‌టుడే: జీవిత బీమా సంస్థలో పాలసీదారులు, ఏజెంట్లకు నష్టం కలిగించే జీఎస్టీని రద్దు చేయాలని ఏజెంట్లు డిమాండు చేశారు. గురువారం వారి సమస్యలపై పార్వతీపురంలోని కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. కొత్త పాలసీ విధానాలను రద్దు చేసి పాత వాటినే కొనసాగించాలని కోరారు. రుణాలపై వడ్డీ రేట్లు తగ్గించాలని, ఏజెంట్ల కమీషన్ పెంచాలని కోరారు. సంఘ నాయకులు ఎల్.రామకృష్ణ, జి.జగన్నాథంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పీవో దృష్టికి సమస్యలు

కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఉన్నత విద్య అభ్యసించేలా వీలుకల్పించే జీవో 342 అమలులో పూర్వ విధానం బాగుండేదని ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాత్సవ్ దృష్టికి పలువురు తీసుకెళ్లారు. గురువారం కలెక్టరేట్‌లో ఆయనను కలిసి వినతిపత్రం అందించారు. ఇటీవల ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలను సందర్శించి గుర్తించిన సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సంఘ జిల్లా అధ్యక్షుడు పైడిరాజు, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, విజయనగరం జిల్లా అధ్యక్షుడు అమర్ ఉన్నారు.


పీవోకు మొక్క అందజేస్తున్న ఉపాధ్యాయులు

సాంకేతిక విధానాలపై అవగాహన


విద్యార్థులకు వివరిస్తున్న కేవీకే శాస్త్రవేత్త

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: మన బడి- మన తోట కార్యక్రమంలో భాగంగా గుమ్మలక్ష్మీపురం కేజీబీవీ విద్యార్థులు గురువారం రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించారు. కేవీకేలో ఏర్పాటు చేసిన పంట క్షేత్రాలను పరిశీలించారు. వ్యవసాయంలో మార్పులు, సాంకేతిక విధానాలు, సాగులో మెలకువలపై శాస్త్రవేత్తలు విద్యార్థులకు అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు డా.ఎస్.శ్రీనివాసరాజు, అనంతవిహారి, స్రవంతి, వ్యవసాయ ఉపాధ్యాయురాలు ఝాన్సీ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

భామిని, న్యూస్‌టుడే: జిల్లా స్థాయిలో చక్కని ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు భామిని ఏకలవ్య పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ గంగాదేవి తెలిపారు. సీతంపేట ఐటీడీఏ ఆధ్వర్యంలో ఎస్‌జీఎఫ్ఐలో వివిధ క్రీడల్లో క్రీడాకారులు పాల్గొని రాణించారన్నారు. రాష్ట్ర స్థాయిలో చెస్, త్రోబాల్‌లో ముగ్గురేసి, జావెలిన్‌త్రో, వెయిట్‌లిఫ్టింగ్‌లో ఒక్కొక్కరు, ఖోఖోలో ఇద్దరు ఎంపికయ్యారన్నారు. వీరిని పీఈటీలు మల్లికార్జునరెడ్డి, సింహాచలం, ఉపాధ్యాయులు అభినందించారు.


ఉపాధ్యాయులతో ఎంపికైన విద్యార్థులు